క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం



గుడ్లవల్లేరు: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక డోకిపర్రులో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారని శ్రీ కొండలమ్మ ఆలయ మాజీ చైర్మన్ కనుమూరి రామిరెడ్డి ఆదివారం తెలిపారు. డోకిపర్రులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో ఆర్బీకే, రూ.20.80 లక్షలతో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను కొడాలి నాని, హారిక ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే గ్రామంలో నాగేంద్ర స్వామి గుడి వద్ద కాలినడక నిమిత్తం ఐరన్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కొత్తపేటలోని బీసీ రామాలయం వద్ద జెడ్పీ నిధులు రూ.15 లక్షలతో కల్యాణ మండపానికి భూమి పూజ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా సినీ మ్యూజికల్ నైట్



గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ప్రదర్శించిన సినీ మ్యూజికల్ నైట్ విద్యార్థుల కేరింతల మధ్య ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. సినీ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్ ఆధ్వర్యంలో బృందంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సినీ గాయకులు ధనుంజయ్, సాహితీ తదితరులు సినీ గీతాలను ఆలపించారు. అనంతరం గాయకులను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ఫార్మసీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, డైరెక్టర్లు ముసునూరి శ్రీనివాసరావు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్, సలహాదారు డాక్టర్ పి.రవీంద్ర బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోదండ రామారావు, డైరెక్టర్ డాక్టర్ జి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఈఈఎంటీలో విద్యార్థిని ప్రతిభ



కైకలూరు: ఎడ్యుకేషనల్ ఇఫిఫని సంస్థ నిర్వహించిన ఈఈ మెరిట్ టెస్ట్‌- 2024లో కైకలూరు మండలం జంగంపాడుకు చెందిన 7వ తరగతి విద్యార్థిని మైలా హేమశ్రీ ఏలూరు జిల్లా ప్రథమ స్థానం సాధించింది. జిల్లా నుంచి 541 మంది విద్యార్థులతో పోటీపడి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇదే పాఠశాలకు 2023, 2024 వరుసగా రెండుసార్లు ఈ అవార్డ్ లభించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అవార్డును విజయవాడలో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ చేతుల మీదుగా రూ.5వేలు ప్రోత్సాహకం, జ్ఞాపికను శనివారం అందించారు.

రాజశ్యామలాదేవి అలంకరణలో శ్యామలాంబ



కైకలూరు: మాఘమాస నవరాత్రులు సందర్భంగా కైకలూరు శ్యామలాంబ అమ్మవారు రాజశ్యామలాదేవి అలంకరణలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రాంగణంలో రామలింగేశ్వర, రామేశ్వర స్వామికి లఘు సంప్రోక్షణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, శ్యామలాంబ, రామలింగేశ్వర, మీసాల వెంకన్న దేవాలయాల చైర్మన్లు బూరుబోయిన మోహన్‌రావు, బొప్పన శివకుమార్, వసుందర మురళి, ఆలయ కార్యనిర్వాహణాధికారి వీఎన్‌కే శేఖర్ పాల్గొన్నారు.

కార్తికేయుడి సన్నిధిలో భక్తజన కోలాహలం

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ఉదయం నుంచే క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్బీకేలు.. రైతు సేవాకేంద్రాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోంది. రైతుపక్షపాతి అనే మాటను నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలను అందిస్తున్నారు. గ్రామాల్లోనే రైతులకు వ్యవసాయానికి సంబంధించి అన్ని రకాల సౌకర్యాలను ఆర్బీకేల్లో కల్పిస్తున్నారు. గుడివాడ నియోజకవర్గంలో 38 ఆర్బీకేల భవనాల నిర్మాణాలకు రూ.8.28 కోట్లను మంజూరు చేసి గ్రామస్థాయిలోనే రైతులకు ప్రభుత్వం సేవలందించేందుకు చర్యలు తీసుకున్నారు.

- రూ.8.28 కోట్లతో రైతు భరోసా కేంద్రాల నిర్మాణం
- మూడు మండలాలకు 38 ఆర్బీకేల మంజూరు



పెదలింగాల రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని, ప్రజాప్రతినిధులు (ఫైల్)



గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకేలు) భవనాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాలకు 38 రైతు భరోసా కేంద్రాల భవనాల నిర్మాణాలకు ఒక్కో దానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.21.8 లక్షలు మంజూరు చేసింది. 38 భవనాలకు గాను ఇప్పటికి 17 పూర్తి కాగా 10 భవనాలను ప్రారంభించడంతో రైతులకు సేవలు అందిస్తున్నాయి. మరో ఏడు భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. 24 భవనాలు నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. గుడివాడ రూరల్ మండలంలో తొమ్మిది ఆర్బీకేల భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. బిళ్లపాడు, దొండపాడు, లింగవరం, మల్లాయపాలెం-2 భవనాల నిర్మాణాలు పూర్తి చేసుకుని రైతులకు సేవలందిస్తున్నాయి. చౌటపల్లి, కల్వపూడి అగ్రహారం, రామనపూడి గ్రామాల్లో భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. మోటూరు, శేరీగొల్వేపల్లి గ్రామాల్లో భవనాల నిర్మాణాలకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నందివాడ మండలానికి సంబంధించి 12 భవనాలకు గాను ఇలపర్రు, పెదలింగాల, తుమ్మలపల్లి గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తి చేసుకుని రైతులకు సేవలందిస్తున్నాయి. కుదరవల్లి రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. అనమనపూడి, పుట్టగుంట గ్రామాల్లో భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అరిపిరాల, జనార్దనపురం, నందివాడ, పోలుకొండ, రుద్రపాక, తమిరిశ గ్రామాల్లో భవన నిర్మాణ పనులకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గుడ్లవల్లేరు మండలంలో 17 భవనాల నిర్మాణాలకు గాను చంద్రాల, గుడ్లవల్లేరు-2, వడ్లమన్నాడులో రైతులకు సేవలు అందిస్తున్నాయి. డోకిపర్రు-2, కౌతవరం-1, కౌతవరం-2, పురిటిపాడు, శేరీకల్వపూడి, విన్నకోట రైతుభరోసా కేంద్రాల భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. అంగలూరు, డోకిపర్రు-1, గుడ్లవల్లేరు-1, వెణుతురుమిల్లి గ్రామాల్లో భవన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. గుడ్లవల్లేరు-1, కూరాడ,పెంజంద్ర, శేరీదగ్గుమిల్లి, వేమవరం గ్రామాల్లో భవన నిర్మాణ పనులు సాంకేతిక సమస్యల కారణంగా ఆలస్యమవుతున్నాయి. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్ అధికారులు పేర్కొన్నారు.

రైతులకు ఎంతో మేలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో రైతుల కష్టాలను తెలుసుకున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు తగిన న్యాయం చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలకు సొంతంగా భవనాలు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేశారు. ప్రతి ఆర్బీకేలో రైతు సహాయకులను నియమించారు. సాగు విషయంలో సలహాలు, సందేహాలను నివృత్తి చేసే విధంగా సిబ్బందిని నియమించారు. ధాన్యం కొనుగోళ్లు సైతం ఆర్బీకేల నుంచే సాగేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడంతో రైతులకు మేలు జరిగింది.



రైతులకు సేవలందిస్తున్న నందివాడ మండలం ఎల్ఎన్ పురం రైతు భరోసా కేంద్రం (ఫైల్)



రైతులకు సేవలందిస్తున్న తుమ్మలపల్లి రైతు భరోసా కేంద్రం



రైతు భరోసా కేంద్రంలో ఎరువులు అందజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

రైతుల పాలిట వరంగా ఆర్బీకేలు



గత ప్రభుత్వాల హయాంలో సలహాలు, సూచనలు కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఆర్‌బీకే సెంటర్ల పుణ్యమా అంటూ రైతుల వద్దకే రైతు సేవలు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు సకాలంలో రైతు సేవలు అందుతున్నాయి. ఆర్‌బీకే సెంటర్ల నిర్మాణం చారిత్రాత్మక నిర్ణయం. మరోమారు జగన్‌మోహన్‌రెడ్డికే రైతుల మద్దతు ఉంటుంది.
– కైలే అశోక్, కౌలు రైతు, తటివర్రు

రాజీ లేకుండా ఆర్బీకేల భవన నిర్మాణాలు



గుడివాడ నియోజకవర్గంలో ఆర్బీకేల భవన నిర్మాణ విషయంలో నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. భవన నిర్మాణాల్లో అవినీతికి తావు లేదు. ప్రభుత్వం ఆర్‌బీకేల నిర్మాణ విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తాం. రైతులకు భవన నిర్మాణాలను త్వరలోనే అందుబాటులోకి తెస్తాం.
–డి.హరనాథ్‌బాబు, పంచాయతీరాజ్ డీఈ

సమాజాభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకం

ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ



పోస్టల్ గుర్తింపు కార్డులను పాత్రికేయులకు అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: సమాజాభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టులు (ఏపీయూడబ్ల్యూజే) ఏలూరు జిల్లా నూతన కమిటీ మొదటి సమావేశం బృందావనం గేటెడ్ కమ్యూనిటీ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కేపీకే కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ అర్హులందరికీ ఇంటి స్థలాలు అందించామన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీఓను అనుసరిస్తూ కైకలూరు నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ ఆర్థిక సాయంతో పాత్రికేయులకు పోస్టల్ ఇన్సూరెన్సు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు కాగిత మాణిక్యరావు, ఐజేయూ నాయకులు జీవీఎస్ఎన్.రాజు, సామ్నా రాష్ట్ర ఉపాధ్యక్షులు బీవీ రామారావు, జిల్లా అధ్యక్షుడు కేపీకే కిషోర్, ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ రియాజ్, జిల్లా ఏపీయూడబ్ల్యూజే జనరల్ సెక్రటరీ బీకే కిషోర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు సంజయ్‌కుమార్, సామ్నా జిల్లా అధ్యక్షుడు శాంతకుమార్, ఆయా సంఘాల కార్యదర్శులు కిషోర్, వాసు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

తోట్లవల్లూరు: మండలంలోని బొడ్డపాడులో కోడిపందేల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఇద్దరు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఒక కోడిపుంజు, రూ.1,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విశ్వనాథ్ తెలిపారు.

‘పాల వెల్లువ’తో మహిళల ఆర్థికాభివృద్ధి

- ప్రైవేటు కేంద్రాల్లో కంటే ఎక్కువ ధర
- 10 రోజులకే నగదు చెల్లింపులు



పామర్రులోని జగనన్న పాల వెల్లువ కేంద్రంలో పాలు పోస్తున్న సభ్యులు (ఫైల్)

పామర్రు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న పాల వెల్లువతో మహిళలు ఆర్థిక పురోభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నారు. జగనన్న పాల వెల్లువ పథకంలో భాగంగా ఫేజ్‌-2లో పామర్రు మండలపరిధిలో ఎనిమిది కేంద్రాలను ప్రారంభించి, వాటి ద్వారా పాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని 106 గ్రామాల్లో సుమారు 65 గ్రామాలలో 15 వేల మంది మహిళా రైతులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 9,000 మంది పాల వెల్లువ కేంద్రాలకు పాలు పోస్తున్నారు. ప్రతి రోజూ ఈ కేంద్రాల ద్వారా సుమారు 4,000 లీటర్లకు పైగా పాల సేకరణ జరుగుతోంది.

బ్యాంక్‌ల ద్వారా చేయూత

పాల పోసే రైతులకు పాడి గేదెల కొనుగోలు కోసం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌ల ద్వారా చేయూత ఇస్తున్నారు. అదేవిధంగా ఎక్కువ మోతాదులో పాలు ఇచ్చే ముర్రాజాతి గేదెలతో పాటు ఇతర మేలు రకం జాతి గేదెల కొనుగోలు చేపడుతున్నారు. వర్కింగ్ కాపిటల్ కింద ఒక్కొక్క గేదెకు ప్రధానమంత్రి పశు కిసాన్ క్రెడిట్ ద్వారా రూ.30 వేల చొప్పున, మరో రూ.70 వేలు బ్యాంకు ద్వారా అందిస్తున్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికే పాలు పోసే అర్హత

వలంటీర్ తన మొబైల్‌లో లింక్ ద్వారా జగనన్న పాల వెల్లువ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని దాని ద్వారా పాల ఉత్పత్తిదారుల వివరాలను రిజిస్ట్రేషన్ చేస్తారు. కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు స్థానిక వలంటీర్ వద్ద నమోదు చేయించుకోవాలి. యాప్ డౌన్లోడ్ చేసుకున్న తర్వాత వలంటీర్ ఆధార్‌కార్డుతో లాగిన్ అవ్వాలి. పాల వెల్లువకు సంబంధించి లాగిన్స్ రూట్ ఇన్‌చార్జ్‌స్, మెంటార్స్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఇచ్చారు. వీరు ఆయా పాల వెల్లువ కేంద్రాలను నిరంతరం తనిఖీ చేస్తూ ఉంటారు.

ఆనందోత్సాహాలు

పాల వెల్లువ కేంద్రాలలో పోసే పాలకు స్థానికంగా ఉన్న కేంద్రాలలో కన్నా ఎక్కువగా వెన్న శాతం ఎక్కువ నగదు చెల్లించడంతో మహిళల ఆనందానికి హద్దులు లేవు. 10 శాతం పాలకు గరిష్ఠంగా రూ.84 చెల్లించడమే కాకుండా 13.0 శాతానికి రూ.104ను అందిస్తున్నారు. ఇది పాడి రైతులకు ఎంతో ఉపయుక్తంగా మారుతోంది.

సంతోషంగా ఉంది



జగనన్న ప్రవేశ పెట్టిన పాల వెల్లువ కేంద్రంలో పాలు పోయడంతో మా ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. ప్రతి 10 రోజులకే పాల నగదు చెల్లింపు వలన కుటుంబ అవసరాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలి.
– బొమ్మారెడ్డి వెంకటరమణ, మహిళా రైతుసభ్యురాలు

10 రోజులకే నగదు చెల్లిస్తున్నారు



గతంలో ప్రైవేటు పాల కేంద్రంలో పాలు పోస్తే రూ.55 మాత్రమే వచ్చేది. ప్రస్తుతం పాల వెల్లువలో పాలు పోస్తే సుమారు రూ.75 వరకు నగదు వస్తోంది. దీనికి తోడు 10 రోజులకే నగదు చెల్లింపుల వలన ఎంతో ఆనందంగా ఉంది. జగనన్న ప్రభుత్వం పదికాలల పాటు ఉండాలి.
– బొమ్మారెడ్డి రాణి సంయుక్త, మహిళా సభ్యురాలు

మహిళల ఆర్థిక పురోభివృద్ధే లక్ష్యం



మహిళల ఆర్థిక పురోభివృద్ధి సాధించే దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోంది. జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా ఎంతో మంది మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. పాల వెన్న శాతానికి అధిక ధరలు చెల్లించడంతో పాటుగా 10 రోజులకే నగదు చెల్లింపుల వలన మహిళలకు ఎంతో ఆసరా ఏర్పడుతోంది.
– ఎం.భారతి, ఎంపీడీఓ పామర్రు

ప్రజల ముంగిటకు సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

కారకంపాడు(మొవ్వ): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం అయ్యంకి సచివాలయం పరిధిలోని కారకంపాడులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, గ్రామ సర్పంచ్ నాగనబోయిన సునీల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, సచివాలయ మండల కన్వీనర్ ఆంజనేయులు పాల్గొన్నారు.
- మొవ్వ మండలం కోసూరు గ్రామంలో జరిగిన పీఏసీఎం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. చైర్మగా ఎంపికైన చిందా సునీత, డైరెక్టర్లుగా ఎంపికైన గోగినేని ఉమామహేశ్వరరావు, కొడాలి సుబ్రమణ్యంను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెనుమూడి రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు భూలక్ష్మి, నాయకులు గోగినేని పెరుమాళ్లు, డొక్కు కృష్ణ, వైస్ సర్పంచ్ చిందా రామకృష్ణ రాజు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

మండవల్లి: ప్రజలతో మమేకమై ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండవల్లి మార్కెట్‌యార్డ్‌లో ఆదివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవ వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందించి ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలతో సత్కరించారు. పెరికెగూడెం నుంచి పి.బుసమ్మకు సేవా వజ్ర పురస్కారం, కానుకొల్లు నుంచి పి శ్యామల, కొవ్వాడలంక నుంచి జయమంగళ నాగశ్రీనివాస్, లింగాల నుంచి కాగిత జీవన, వీర నాగబాబు, లోకుమూడి నుంచి ఎస్.స్నేహ, పెరికెగూడెం నుంచి పెరుమాళ్ల చైతన్యకు సేవా రత్న పురస్కారాలను, సేవా మిత్ర పురస్కారాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, బేతపూడి యేసోబురాజు, కుర్రేళ్ల మేరమ్మ, బలే నాగరాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ పాల్గొన్నారు.
- ముదినేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకరమణ పాల్గొని సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్, నగదు పురస్కారాలను ఆదివారం అందించి సత్కరించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మొట్రూ ఏసుబాబు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంట సంధ్య, రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, కోమటి విష్ణు పాల్గొన్నారు.



మండవల్లిలో వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ



ముదినేపల్లిలో వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

నేడు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

చినపారుపూడి(పెదపారుపూడి): మండలంలోని చినపారుపూడి గ్రామంలోని ప్రధానం సెంటర్‌లో శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఉదయం 10:38 గంటలకు వైభవంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ నగుళ్ల శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. గ్రామంలో యాదవులందరూ కలిసి విరాళాలు సేకరించి శ్రీకృష్ణ మందిరం నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ యువజన అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, గుడివాడ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను హాజరవుతారని తెలిపారు. ఆదివారం శ్రీకృష్ణ స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. యాదవ సంఘ యువకులు అధిక సంఖ్యలోని డ్యాన్స్‌లు చేశారు. మొవ్వా శ్రీనివాసరావు, జాజుల నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



ఎడ్ల బండిపై స్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

ప్రత్యేక పూజల్లో దంపతులు

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయం ప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివారం రెండో రోజు ఘనంగా కొనసాగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పదుల సంఖ్యలో దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీగణపతి, శ్రీకృష్ణ, ధ్వజ, శిఖర పూర్వక హనుమత్ లక్ష్మణ సహిత శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠకు వేదపండితుల ఆధ్వర్యంలో యాగశాలలో హోమాలు కొనసాగాయి. ధ్వజస్తంభాన్ని అలంకరించి ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.



కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలో భక్తులు అధిక సంఖ్యలో ఆలయం వెలుపల బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

అ‘పూర్వ’ కలయిక



పూర్వ విద్యార్థులు

గుడివాడ టౌన్: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక మాంటిస్సోరి హైస్కూల్లో జరిగింది. 1996వ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించి రకరకాల వృత్తుల్లో దేశ విదేశాల్లో స్థిరపడిన వారంతా ఇక్కడ చేరి ఆనందోత్సాహాలతో తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం వారికి విద్యనేర్పిన గురువులను సత్కరించారు.